# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రేపు విడుదల చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**
2. **దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ఇందన ధరలను లీటరుకు 2 రూపాయాల చొప్పున తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.**
3. **ఏపీ ఈసెట్-2024 దరఖాస్తులు ఈరోజు ప్రారంభించినట్లు ఏపీ ఈసెట్ ఛైర్మన్ పేర్కొన్నారు.**
4. **అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర పర్యాట శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు.**
5. **రానున్న ఎన్నికల్లో దేశ అభివృద్ధి కోసం తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని యువ ఓటర్లు పేర్కొంటున్నారు.**

==========================

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. రేపు మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపింది. ఈ మేరకు పాత్రికేయుల సమావేశం ఉంటుందని వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఏకకాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రేపు ఎన్నికల సంఘం అధికారికంగా వెల్లడించనుంది.

--------------------------

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ఇందన ధరలను లీటరుకు 2 రూపాయాల చొప్పున తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. చమురు మార్కెటింగ్ కంపెనీలు సవరించిన ఈ ధరలు ఈ రోజు నుంచి అమలులోకి వస్తాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ తగ్గింపు నిర్ణయం వినియోగదారులకు ఊరటనిస్తుందని... డీజిల్‌తో నడిచే 58 లక్షల గూడ్స్ వాహనాలు, 6 కోట్ల కార్లు, 27 కోట్ల ద్విచక్రవాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ పేర్కొంది. లీటర్ పెట్రోల్‌పై రెండు రూపాయలు తగ్గిస్తూ తీసుకున్న తాజా నిర్ణయంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 94 రూపాయల 72 పైసలు, ముంబయిలో 104 రూపాయల 21 పైసలు, కోల్‌కతాలో 103 రూపాయల 94 పైసలు, చెన్నైలో 100 రూపాయల 75 పైసలుగా ఉండనున్నాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు, బీఎస్సీ గణితం పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సులో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈసెట్-2024 దరఖాస్తులు ఈరరోజు నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏపీ ఈసెట్ ఛైర్మన్, అనంతపురం జేఎన్‌టీయూ ఉపకులపతి ఆచార్య

శ్రీనివాసరావు వెల్లడించారు. జేఎన్‌టీయూలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఉపకులపతి మాట్లాడుతూ... ఈరోజు నుంచి ఏప్రిల్ 15 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. 500 రూపాయలు అపరాధ రుసుంతో ఏప్రిల్ 22 వరకూ, 2 వేల రూపాయల అపరాధ రుసుంతో 29 వరకూ, 5 వేల రూపాయల అపరాధ రుసుంతో మే 2వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 8న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 100 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాని ఉపకులపతి వెల్లడించారు.

---------------------------

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర పర్యాట, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. చిత్తూరు జిల్లా నగరిలో 60 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద నగదును ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. నగరి నియోజకవర్గంలో 60 మంది దరఖాస్తు చేసుకుంటే అందరికీ చెక్కులను అందించినట్లు పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సాయంకాలం తెలంగాణలో పర్యటిస్తారు. వచ్చే వారం రోజుల్లో రాష్ట్రంలో ఆయన మూడు చోట్ల సభలు, రోడ్ షోలు నిర్వహించనున్నారు. ఈరోజు ప్రధానమంత్రి మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి వరకు బీజేపీ నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. రేపు నాగర్ కర్నూల్‌లో బహిరంగసభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. వచ్చే సోమవారం మరో విడత తెలంగాణలో పర్యటించి, జగిత్యాలలో జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రదానమంత్రి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు తెలంగాణలో పర్యటిస్తూ ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రేపు విశాఖపట్నంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ –సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు తెలిపారు. విశాఖలో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఆవరణలో భారీ సభ ఏర్పాటు చేస్తున్నామని... ఈ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

---------------------------

రానున్న ఎన్నికల్లో ఓటు వేయడమే కాకుండా దేశ అభివృద్ధి కోసం తమ ఓటును వినియోగించుకుంటామని యువ ఓటర్లు పేర్కొంటున్నారు. వీరిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న మేరా పెహ్లా ఓట్ దేశ్ కేలియే ప్రచారం తిరుపతి జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాకు చెందిన యువ ఓటర్లు ఆకాశవాణితో మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది కాబట్టి తాము ఓటు హక్కును వినియోగించుకుంటామని... మొదటి ఓటు దేశ అభివృద్ధి కోసమేనని తెలుపుతూ..

వాయిస్ – 20 సెకన్లు

---------------------------

విశాఖనగరం పచ్చదనం పరిరక్షణలో బాధ్యతాయుతమైన పాత్రపోషిస్తున్నామని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ అంగముత్తు తెలిపారు. విశాఖ పోర్ట్ ప్రవేశ మార్గాల్లో ఒకటైన పురాతన సీహార్స్ జంక్షన్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లిఖార్జున, జివిఎమ్సీ అదనపు కమిషనర్ కే.ఎస్.విశ్వనాథ్‌తో కలిసి ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ... పచ్చదనం కోసం 5.6 లక్షల మొక్కలను

పెంచుతున్నామని మరో లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. భీమిలిపట్నం నుంచి తీరం వెంబడి సముద్రం కోతకు గురికాకుండా మడ అడవుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు. పోర్ట్ ప్రధాన ప్రవేశ మార్గం నుంచి వేదాంత టెర్మినల్ వరకూ వుండే మార్గం, నేమ్ ఐలాండ్, రహదారి సుందరీకరణను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.

-------------------------

ఈనెల 18న నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి శ్రీ సత్యసాయి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి తెలిపారు. పుట్టపర్తిలోని డిఈఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 115 పరీక్షా కేంద్రాలలో పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 30 నిమిషాల ముందే రావాలని సూచించారు.

-------------------------

రాష్ట్రంలోని అన్ని వర్గాలవారికి సంక్షేమ ఫలాలను పూర్తి స్థాయిలో అందిస్తున్నామని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో జగనన్న కాలనీని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అర్హులైన వారి  కోసం జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి అన్నిరకాల మౌలిక సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు సొంతింటి కలను సాకారం చేశామని వివరించారు.

-------------------------

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే విధంగా నీటి నిల్వ ట్యాంక్ పనులు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్  దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కుంచనపల్లిలో స్టోరేజ్ ట్యాంక్ పనులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 73 కోట్ల 43 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 54 ఎకరాల్లో నీరు నిల్వ సామర్థ్యం గల చెరువును తవ్వడంతో పాటు రెండవ రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన అన్ని పనులు చేపడతామని అన్నారు.  సరికొత్త ఆధునిక  సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టే పనుల ద్వారా 30 శాతం నీరు అదనంగా నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది అన్నారు.

-------------------------

దేశవ్యాప్తంగా డ్యామ్‌ల పరిరక్షణకు, భద్రతా ప్రమాణాలను పాటించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు జాతీయ డ్యామ్  భద్రతా సంస్థ-ఎన్డీఎస్ఏ సిఫార్సులు-2023 పేరుతో గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డ్యామ్‌ల పరిరక్షణకు గాను అమలు చేయాల్సిన నిర్వహణ, రక్షణ,తనిఖీ, ఆపరేషన్ అంశాలతోపాటు ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే వాటికి బాధ్యత వహించేలా నిర్దిష్ట విధి విధానాలను జారీ చేసింది. ఈ మేరకు ప్రతి ఆనకట్టకు డిజిటల్ లాగ్‌బుక్, ప్రత్యేకంగా డేటాబేస్‌ను రాష్ట్ర డ్యామ్ భద్రతా సంస్థ-ఎస్‌డీఎస్‌వో నిర్వహించాలని వివరాలనుడిజిటల్ రూపంలో ఆన్‌లైన్‌లో నిక్షిప్తంచేయాలని సూచించింది.

-------------------------

చిత్తూరు జిల్లాలో నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. జిల్లాలో ఈ నెల 17న గ్రూప్-1 పరీక్షలకు ఎస్వీ సెట్, సీతమ్స్, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మూడు కేంద్రాలలో 2 వేల 518 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవనున్నారని తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 9491077356కు సంప్రదించాలని తెలిపారు.

======================